క్లుప్తంగా

ముంపు ప్రాంతాల్లో ఎన్యూమరేషన్



పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాలైన సుదరయ్యనగర్, రాజీవ్ నగర్, రాధానగర్, కండ్రిక ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన ఇళ్ల వద్ద సచివాలయ సిబ్బంది బుధవారం సర్వే చేశారు. వరదల్లో ఇంటికి ఎంత మేర నష్టం జరిగిందనే సమాచారాన్ని బాధిత కుటుంబాల నుంచి సేకరించారు. ఇంటిలో విలువైన గృహోపకరణాల వివరాలను కూడా అడిగి తెలుసుకుని నమోదు చేశారు. బాధితులు నివసిస్తున్న ఇల్లు సొంతమా, లేక అద్దెదా అన్న వివరాలను సేకరించి, ఆధార్ కార్డు, రేషన్ కార్డు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా ముంపులోనే ఉన్న ఇళ్ల వారు సచివాలయానికి వచ్చి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అక్కరకొచ్చిన పాతపాడు-కండ్రిక రోడ్డు



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పాతపాడు – కండ్రిక రోడ్డు వరద బాధితులకు అక్కరకొచ్చింది. వరద బీభత్సం కారణంగా ఎటువంటి రోడ్డు మార్గం లేక అవస్థలు పడుతున్న వారికి 64వ డివిజన్ కండ్రిక కట్టరోడ్డు నుంచి పాతపాడు గ్రామం వైపు వెళ్లేందుకు ఈ రోడ్డును ఉపయోగపడుతోంది. విజయవాడ తోపాటు నున్న, నూజివీడు వైపు వెళ్లే వారు సైతం ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సెంట్రల్ ఎమ్మెల్యే రూ.3.45 కోట్లతో అభివృద్ధి చేయించారు. ప్రస్తుతం కండ్రిక పరిసర ప్రాంతాల ప్రజలందరూ విజయవాడ వెళ్లేందుకు దీనినే ఉపయోగిస్తున్నారు. పైపుల రోడ్డు నుంచి రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్, ఉడా కాలనీకి వెళ్లే వారికి వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన ఆహ్వానం కల్యాణ మండపం రోడ్డు ఉపయోగపడుతోంది.

సినీ చరిత్రలో కృష్ణంరాజు స్థానం తిరుగులేనిది



మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు సినీ చరిత్రలో రెబల్‌స్టార్ కృష్ణంరాజు స్థానం తిరుగులేనిదని సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు డి.మురళీ కృష్ణంరాజు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో బుధవారం సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యాన కృష్ణంరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణంరాజు ఫ్యాన్స్ సీనియర్ నాయకుడు వేజెళ్ల రాజేంద్రప్రసాద్‌తో కలిసి కృష్ణంరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ నున్న శివ నాగేశ్వరరావు, యు.కనకారావు, నవనీతం సాంబశివరావు, ఉప్పలపాటి శ్రీనివాస రాజు, గుర్రం సుబ్బారావు, కారుమూరు సురేష్, బెజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్లకు పోటెత్తుతున్న బైక్‌లు



పాయకాపురం(విజయవాడరూరల్): రోజుల తరబడి వరద ముంపునకు గురైన ద్విచక్రవాహనాలు మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్లకు భారీగా వస్తున్నాయి. వరద నుంచి బయటపడిన ప్రాంతాల్లోని ప్రజలు తమ వాహనాలను మెకానిక్‌ల వద్దకు తీసుకొస్తున్నారు. ఈ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం ప్రకటించక పోవడంతో ప్రజలే అప్పు చేసి మరీ మరమ్మతులు చేయిస్తున్నారు. తినడానికి తిండి ఉన్నా లేకున్నా పనులకు వెళ్లాలంటే ద్విచక్రవాహనం అవసరం తప్పదని చిరుద్యోగులు పేర్కొంటున్నారు. పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని మెకానిక్ షెడ్లన్నీ మరమ్మతుల కోసం వచ్చిన బైక్‌లతో నిండిపోయాయి.

తాగునీరు, పాలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు వైఎస్సార్ సీపీ, జగనన్న అభిమాని చాంద్ బాషా స్నేహితులతో కలిసి బుధవారం సాయంత్రం పాలు, తాగునీరు పంపిణీ చేశారు. వరద ముంపుతో అల్లాడుతున్న రామకృష్ణాపురం, తదితర ప్రాంతాలలో బాధితులకు జగనన్న స్ఫూర్తితో తమ వంతు సహాయంగా స్నేహితులతో కలిసి పాలు, తాగునీరు అందజేస్తున్నట్లు బాషా తెలిపారు.

విద్యార్థులకు తప్పని వరద కష్టాలు



వరదలో తడిచిన పుస్తకాలు



పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద కష్టాలు విద్యార్థులకు సైతం తప్పటం లేదు. అకస్మాత్తుగా వచ్చిన వరదతో ఎవరికి వారు ఇళ్లను వదలి ప్రాణాలను రక్షించుకునేందుకు పరుగులు తీశారు. వరద నీరు ఇళ్లలోకి చేరుకోవటంతో విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు తడిచి పాడైపోయాయి. పాడైన పుస్తకాలను చూసి విద్యార్థులు బావురుమంటున్నారు. పది రోజులుగా పాఠశాలలకు దూరమైన విద్యార్థులు ఇప్పుడు వరద నీరు తగ్గటంతో పాఠశాల, కళాశాల బాట పట్టారు. దీంతో తమ పాఠశాల, కళాశాల పుస్తకాలు, విద్యాసామగ్రి కోసం వెతుక్కుంటున్నారు. వరద నీటిలో కొన్ని పుస్తకాలు, బ్యాగులు కొట్టుకు పోగా మరికొన్ని తడిచి బురదతో నిండిపోయాయి. ఉన్న పుస్తకాలను జాగ్రత్తగా ఎండ పెట్టుకుంటున్నారు. అసలే వరద కష్టాలతో ఇంట్లోని సర్వం కోల్పోయిన స్థితిలో ఇప్పుడు తిరిగి పుస్తకాలు, బ్యాగులు కొనాల్సి రావటం తల్లితండ్రులకు భారంగా మారింది. రెండు నెలల పాటు కష్టపడి రాసుకున్న నోట్స్ నీట మునగటంతో తమ బిడ్డల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ పుస్తకాలు కొనాలి



ఇటీవల వచ్చిన వరదలలో సర్వం కోల్పోయాం. పిల్లల పుస్తకాలు కూడా వరద పాలు కావటం బాధగా ఉంది. పిల్లలు కష్టపడి చదువుకుంటున్నారు. ఇప్పుడు పుస్తకాలు, బ్యాగులు పాడవటంతో వారి భవిష్యత్తుపై ఆందోళనగా ఉంది. ఇద్దరి పుస్తకాల కోసం ఇప్పటికే రూ.15 వేలు ఖర్చు చేశాను. ఇప్పుడు తిరిగి పుస్తకాలు కొనాలంటేనే భయంగా ఉంది.

– జి.శ్రీకాంత్, వాంబేకాలనీ

మళ్లీ రాసుకోవాలంటే ఇబ్బందే..



నాకు ఇద్దరు పిల్లలు ఒకరు పదో తరగతి, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలో ఇంట్లోని సామాన్లుతో పాటు పిల్లల పుస్తకాలు పాడయ్యాయి. వరదల సమయంలో పిల్లలను వేరే ఊరు పంపించేశాను. ఇప్పుడు వరద తగ్గిన తరువాత చూస్తే పుస్తకాలు పనికి రాకుండా పోయాయి. ఇప్పుడు పుస్తకాలు బ్యాగులు కొనటం ఒక సమస్య కాగా.. నోట్స్ తిరిగి రాసుకోవటం మరో సమస్యగా ఉంది.

– బోను పూర్ణ, బుడమేరు మధ్యకట్ట

వీధుల్లో మురుగు నీటి విలయతాండవం



రాధానగర్‌లో మురుగునీటితో నిండిన వీధి



కండ్రికలోని ఓ వీధిలో నిలిచిన మురుగునీరు

పాయకాపురం(విజయవాడరూరల్)/లబ్బీపేట(విజయవాడతూర్పు): బుడమేరు వరద నుంచి ఇంకా కొన్ని కాలనీలు ఇప్పటికీ కోలుకోలేదు. కండ్రిక, రాధానగర్, ఎల్‌బీఎస్ నగర్ వంటి కాలనీల్లో అంతర్గత వీధుల్లో మోకాలి లోతున మురుగు నీరు నిలిచి ఉంది. రాధానగర్ నాలుగు స్తంభాల సెంటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డు, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్స్ రోడ్డు ప్రాంతాల్లోని వీధుల్లో మురుగునీరు విలయతాండవం చేస్తోంది. ఆ వీధుల్లోని ప్రజానీకం మురుగునీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. మురుగు నీటి నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. కండ్రిక నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే రహదారిలో రెండు అడుగుల లోతున మురుగు నీరు తిష్టవేయడంతో రాకపోకలకు ప్రజలు ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. వాడుక అవసరాల కోసం నీరు లేకపోవడంతో మహిళలు వరద నీటితో అంట్లు తోముకొంటున్నారు. దుస్తులను కూడా ఆ నీటితోనే ఉతుకుతున్నారు. దొంగల భయంతో స్థానికులు మురుగు సమస్య వేధిస్తున్నా తమ ఇళ్లలోనే ఉంటున్నారు. నష్టపరిహారం నమోదు చేసే బృందాల రాక కోసం బాధితులు ప్రధాన రోడ్లపైనే వేచి చూస్తున్నారు. మరోవైపు నిత్యావసరాలు కూడా ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. నిత్యావసరాలు తీసుకుని మోకాల్లోతు నీటిలో నడుచుకుంటూ ఇళ్లకు వెళ్తున్నారు. ఇప్పటికే పది రోజుల నుంచి మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నామని, ఇంకెన్ని రోజులు ఇలా గడపాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సక్రమంగా స్పందించి ఉంటే తమకు ఈ తిప్పలు తప్పేవని వాపోతున్నారు.

ఘనంగా ముగిసిన వినాయక చవితి వేడుకలు



శ్రీనగర్ కాలనీలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా



వినాయకునికి పూజలు చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన వినాయక చవితి వేడుకలు బుధవారంతో ముగిశాయి. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన శ్రీనగర్ కాలనీలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు పాల్గొని వినాయకుడికి పూజలు చేసి భోజనాలు వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏపుగంటి సాయికృష్ణ, లక్ష్మీఅపర్ణ, నాయకులు నవనీతం సాంబశివరావు, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

దావుబుచ్చయ్యకాలనీలో..

దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం సమీపంలో చింతపల్లి నాగ సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని, కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి కనకారావుతో కలిసి పూజలు చేసి భోజనాలు వడ్డించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి మేళతాళాలు, కోలాట నృత్యం, తీన్‌మార్, డీజేలతో నిమజ్జనోత్సవం జరిగింది.

సిద్ధమవుతున్న పెట్రోల్ బంకులు

- వరద ముప్పుతో 12 రోజులుగా మూతపడిన బంకులు
- పెట్రోల్ ట్యాంక్‌ల్లోకి చేరిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది
- రెండు రోజుల్లో అందుబాటులోకి రానున్న బంకులు



పంపింగ్ స్టేషన్‌ను సర్వీస్ చేస్తున్న టెక్నీషియన్



సింగ్‌నగర ఆంధ్రప్రభకాలనీలో మూతపడిన పెట్రోల్ బంక్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో వరద కారణంగా 12 రోజులుగా మూతపడిన పెట్రోల్ బంకులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యజమానులు సిద్ధం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరద వీడినప్పటికీ ఆయా ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులు తెరుచుకోలేదు. దీంతో ముంపు ప్రాంత వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరురోడ్డు, బందరు రోడ్డు, గుణదల తదితర సుదూర ప్రాంతాలకు నాలుగైదు కిలోమీటర్లు వెళ్లి పెట్రోల్, డీజిల్ కొట్టించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత నెల 31న బుడమేరు ఉప్పొంగి అధిక స్థాయిలో వరద రావడంతో సింగ్ నగర్, ఆంధ్రప్రభకాలనీ, పైపుల రోడ్డు, కండ్రిక, నున్న, కబేళా తదితర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న సుమారు 15 పెట్రోల్ బంకుల్లోకి కూడా ఆరడుగుల నీరు చేరడంతో వాటిని మూసివేశారు. అప్పటి నుంచి పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. నాలుగు రోజుల క్రితం ఆయా ప్రాంతాల్లో వరద తగ్గడంతో బంకులను తెరిచేందుకు యజమానులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బంకుల ఆవరణంలో పెట్రోల్, డీజిల్‌ను నిల్వచేసే ట్యాంక్‌లలోకి చేరిన నీటిని మోటర్ల ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు. పంపింగ్ స్టేషన్లను టెక్నీషియన్లతో సర్వీస్ చేయిస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తవడానికి రెండు రోజులు పడుతుందని, పూర్తయిన వెంటనే బంకులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తామని సిబ్బంది చెబుతున్నారు.

వరద నీటిని బయటకు పంపించాలి

కలెక్టర్ డాక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లోతట్టు ప్రాంతాల్లో ఇంకా ఎక్కడైనా వరద నీరు నిలిచి ఉంటే త్వరితగతిన బయటకు పంపేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.కన్నబాబు, కలెక్టర్ సృజనతో కలసి విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంబాపురం పంచాయతీ పరిధిలో ఇంకా నీరు నిలిచి ఉందన్నారు. వదర నీటిని త్వరితగతిన బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లేలా కల్వర్టులలో డీసిల్టింగ్ చేయాలని సూచించారు. పరిశీలించిన వారిలో డీపీఓ ఎస్.వి.శివ ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

లైన్ బాక్స్‌లను పునరుద్ధరించాలి

కార్మిక సంఘం డివిజనల్ కార్యదర్శి అశోక్‌కుమార్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో గార్డ్స్ సిబ్బంది విజయవాడ రైల్వే స్టేషన్‌లోని గార్డ్స్ లాబీ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం విజయవాడ డివిజన్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా గార్డ్స్ సిబ్బందికి ఉన్న లైన్ బాక్స్ సదుపాయం తొలగించడం సరైన చర్య కాదన్నారు. లైన్ బాక్స్‌కు బదులుగా ట్రాలీ బ్యాగులను అందజేయడంతో విధులకు వెళ్లే గార్డ్స్ సిబ్బంది తమ లగేజీకి అదనంగా ట్రాలీ బ్యాగులను తీసుకెళ్లడం కష్టంగా ఉంటోందన్నారు. కనీసం లాకర్ సదుపాయం కూడా లేకపోవడంతో ట్రాలీ బ్యాగులను ఇళ్లకు మోసుకెళ్లి, తిరిగి విధులకు తీసుకురావాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ట్రాలీ బ్యాగులో ప్రమాదకరమైన డిటోనేటర్లను ఉంచడంతో వాటిని ఏవిధంగా ఇళ్లకు మోసుకుపోవాలో అధికారులు పునరాలోచన చేయాలని కోరారు. గార్డ్స్‌కు టెయిల్ ల్యాంపు, సిగ్నల్ ల్యాంపులు కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గార్డ్స్ సిబ్బంది న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ డివిజనల్ సెక్రటరీ కె.మోహన్ దాస్, ఎండీ నజీర్ అహమ్మద్, కార్మిక సంఘం సహాయ కార్యదర్శి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలతో సంస్థల అభ్యున్నతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ అంబడిపూడి వీరరాఘవశాస్త్రి వంటి ఉద్యోగుల సేవలతోనే సంస్థలు అభ్యున్నతిని సాధిస్తాయని ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సి.వి.ఎస్.భాస్కరరావు అన్నారు. వీరరాఘవశాస్త్రి ఇటీవల ఉద్యోగ విరమణ చేయగా ఆయన అభినందన కార్యక్రమం బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగింది. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎం.వి.శ్రీధర్‌తో పాటుగా వివిధ హోదాల్లోని ఉన్నతాధికారులు, స్థానిక రీజనల్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి వక్త శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14,15 తేదీల్లో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టెప్ (స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్) సమన్వయకర్తలు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ధర్మరెడ్డి, రహీమా బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టి ఆత్మ విశ్వాసం పెంపొందించటం ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవటానికి వక్త శిక్షణ తరగతులు దోహదపడతాయని సూచించారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90306 44440, 81432 34555 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరద నీటి నిల్వలు లేకుండా చూడండి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



వరద ప్రభావిత ప్రాంతంలో పరిస్థితిని తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద నీటి నిల్వలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రోడ్ల వెంబడి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బుధవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన నందమూరినగర్, వాంబే కాలనీ, కండ్రిక సెంటర్, సీవీఆర్ ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. నందమూరినగర్‌లో భూగర్భ డ్రెయినేజీ, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి కుళాయిల్లో వస్తున్న నీటిని వాడుక అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. తాగునీటిని ప్రత్యేకంగా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని వివరించారు. రోడ్లపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు తరచూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులను ఆదేశించారు. వరదలో కొట్టుకొచ్చిన వ్యర్థాలను తొలగించడానికి 465 వాహనాలను వినియోగిస్తున్నామని వివరించారు. 184 ట్రాక్టర్లు, 122 టిప్పర్లు, 65 జేసీబీలు, 22 బోబ్క్యాట్‌లు, 13 డోజర్లు, ఏడు పొక్లెయిన్లు, రెండు క్రేన్లు, 25 కాంపెక్టర్లు, 23 ఎయిర్‌టెక్ మెషిన్లతో వరద ప్రభావిత ప్రాంతాలను శుభ్రం చేస్తున్నామని వివరించారు. ఇతర ప్రాంతాల్లోని మునిసిపాలిటీల నుంచి వచ్చిన 6,830 మంది పారిశుద్ధ్య కార్మికులు, 950మంది శానిటరీ సూపర్‌వైజర్లు, 62 మంది శానిటరీ నోడల్ ఆఫీసర్లు, 149మంది పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ, వార్డ్ సచివాలయ స్పెషల్ ఆఫీసర్లు, 32 మంది వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు, ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను శరవేగంగా చేస్తున్నామని తెలిపారు.

వరద బాధితులకు తెలంగాణ ప్రజల సాయం



బాధితులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేస్తున్న కోమట్లగూడెం గ్రామ ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపునకు గురైన సింగ్‌నగర్ ప్రాంత బాధితులకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు బాసటగా నిలిచారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం, కోమట్లగూడెం గ్రామ ప్రజలు ఇక్కడి వరద బాధితులకు సహాయం చేయాలని ఆలోచన చేశారు. గ్రామ ప్రజలంతా కలిసి బియ్యం, దుస్తులు, ఆహారం పోగుచేసి బుధవారం సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లోని వరద బాధితులకు పంపిణీ చేశారు. కోమట్లగూడెం గ్రామ ప్రజలు చేసిన సాయాన్ని అధికారులు, స్థానిక ప్రజలంతా మెచ్చుకున్నారు.

సీపీఐ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలి

బుడమేరు వరద ముంపు ప్రాంతాలలోని ప్రజలకు సహాయం చేయడంలో సీపీఐ శ్రేణులంతా విరివిగా పాల్గొనాలని పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. పాపులర్ షూ మార్ట్ – అక్షయ పాత్ర సౌజన్యంతో సింగ్‌నగర్‌లో బుధవారం వరద బాధితులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సీపీఐ నగర నాయకులు నక్కా వీరభద్రరావు, కె.వి. భాస్కరరావు, బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో దూకిన యువకుడ్ని కాపాడిన పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని బందరు లాకుల వద్ద కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని స్థానికుల సహాయంతో పోలీసులు కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన యువకుడు వికాస్ మద్యం తాగి ఇంటికి వెళ్లగా తల్లిదండ్రులు మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అతను బుధవారం సాయంత్రం 6.30 గంటలకు బందరు లాకుల వద్దకు వెళ్లి కాలువలో దూకాడు. స్థానికుల నుంచి ఈ సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోట్ కానిస్టేబుళ్లు వి.నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్ కాలువలో కొట్టుకుపోతున్న వికాస్‌ను కాపాడి స్టేషన్‌కు తరలించారు. యువకుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేసి ఇంటికి పంపారు. ఘటనపై వెంటనే స్పందించి యువకుడి ప్రాణం కాపాడిన సిబ్బందిని నగర సీపీ ఎస్.వి.రాజశేఖర బాబు అభినందించారు.

ఇన్నర్‌రింగ్ రోడ్డుకు గండ్లు



ఇన్నర్ రింగ్‌రోడ్డుకు గండికొట్టడంతో బుడమేరులోకి వెళ్తున్న వరద నీరు

పాయకాపురం(విజయవాడరూరల్): అంబాపురం ఒకటో వార్డులో పది రోజులుగా ఉన్న బుడమేరు వరద నీటిని బయటకు పంపేందుకు అధికారులు బుధవారం సాయంత్రం జక్కంపూడి – పైపుల రోడ్డు (ఇన్నర్‌రింగ్ రోడ్డు)కు గండ్లు పెట్టారు. ఉదయం రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణరావు, కమిషనర్ అండ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కన్నబాబు, ఎంపీ కేశినేని చిన్ని, అంబాపురంలో వరద పరిస్థితిని పరిశీలించారు. జక్కంపూడి నుంచి జక్కంపూడి జంక్షన్‌కు వచ్చే రోడ్డుకు ఒక చోట, పైపుల రోడ్డుకు వెళ్లే రోడ్డులో విక్రమ్ పబ్లిషర్స్ వద్ద, అదే రోడ్డులో మరో చోట గండి పెట్టి అంబాపురంలో ఉన్న నీటిని బయటకు పంపుతున్నారు. ఆ నీరంతా బుడమేరులో కలిసేలా గండ్లు పెట్టారు. గండ్లు పెట్టేముందు ఈ ప్రాంతాన్ని కలెక్టర్ జి.సృజన, పంచాయతీరాజ్ డెప్యూటీ కమిషనర్ వి.నాగార్జున సాగర్, డీపీఓ ఎస్.వి.శివప్రసాద్ యాదవ్, గ్రామ సర్పంచి గండికోట సీతయ్య, ఈఓఆర్డీ ప్రసాద్ ఈ ప్రాంతాన్ని సందర్శించారు.

● మొండికేస్తున్న మోటార్లు



బుడమేరు వరదలో మునిగిపోయిన ఇళ్లలోని మోటార్లు మొండికేస్తున్నాయి. కొన్ని తిరగకుండా స్ట్రక్ అవుతున్నాయి. మరి కొన్నింటిలో వైండింగ్ కాలిపోయింది. బాధితులు వాటిని మరమ్మతుల కోసం మెకానిక్ షాపుల వద్దకు తీసుకొస్తున్నారు. కండ్రిక ప్రధాన రహదారిలో ఓ షాపు వద్ద పదుల సంఖ్యలో మోటార్లను మరమ్మతులకు తీసుకొచ్చారు. వాటిలో చాలా వరకూ వైండింగ్ కాలిపోయినట్లు టెక్నీషియన్ పేర్కొన్నారు. రెండు రోజుల్లో వందకు పైగా మోటార్లు రిపేరు కోసం వచ్చాయని వివరించారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)